# అలరులు కురియగ

అన్నమాచార్య

అలరులు కురియగ నాడెనదే ।
అలుకల గులుకుల నలమేల్మంగ ॥

అరవిరి సొబగుల నతివలు మెచ్చగ ।
అరతెర మరగున నాడెనదే ।
వరుస పూర్వదువాళపు తిరుపుల ।
హరిగరగింపుచు నలమేల్మంగ ॥

మట్టపు మలపుల మట్టెల కెలపుల ।
తట్టెడి నడపుల దాటెనదే ।
పెట్టిన వజ్రపు పెండెపు తళుకులు ।
అట్టిట్టు చిమ్ముచు నలమేల్మంగ ॥

చిందుల పాటల సిరి పొలయాటల ।
అందెల మోతల నాడెనదే ।
కందువ తిరువేంకటపతి మెచ్చగ ।
అందపు తిరుపుల నలమేల్మంగ ॥